
475 p. M. 2466 సం॥ చంద



# ఏప్రల్ విషయసూచిక.


| | పుట. |
|---|---|
| స్వవిషయము— | 3 |
| సందేహము— | |
|     మల్లవరపు విశ్వేశ్వరరావుగారు | 4 |
| ఇద్దరితగాయిదా— | |
|     వనవిహారి | 5 |
| ప్రభాతము— | |
|     శ్రీ శ్రీనివాసరావుగారు | 11 |
| శ్రీమాన్ డాబులరాయుడు— | |
|     సేవ | 12 |
| సందేశము— | |
|     మ. విశ్వేశ్వరరావుగారు | 14 |
| దేశదిమ్మరి— | |
|     అగ్నిహోత్రుడు | 15 |
| ప్రేమాస్తమయము— | |
|     స్వర్గీయ శ్రీమతి తంగవల్లి | 18 |
| ప్రదర్శనానంతరము— | |
|     ఆంటన్ చెకోవ్ | 24 |
| రాజకీయవాతావరణము— | |
|     ఒక బ్రాహ్మణేతరుడు | 29 |
| అరవనటులు, నాటకములు— | |
|     సారథి | 31 |
| ఋషిబంకిమచంద్రుడు— | |
|     శ్రీ బి జయగోపాలరెడ్డిగారు | 33 |
| ప్రపంచవీక్షణము— | 40 |

# చందాదారుల ఆర్డరు ఫారము.

తేది......................19

మేనేజర్:—

"ఆనంద భారతి"

మదరాసు.

అయ్యా,

తమ ఆనందభారతి పత్రికకు నన్నొక సంవత్సరపు చందా దారుగా జేర్చుకొని పత్రికనంపగోరెదను. సంవత్సర చందా రూ. 1—4—0 మనియార్డరు ద్వారా పంపుచున్నాను. చందాకు ప్రథమ పత్రిక వీ. పీ. గాపంపగోరెదను. (సమయానుకూలముగ పై రెంటిలో నేదియో యొకటి కొట్టివేయవలెను.)

చిత్తగించవలెను.

సంతకము.

చందాదారు పేరు..........................................................

విలాసము..........................................................

..........................................................

# ఆనందభారతి

## కథల మాసపత్రిక.

సంపుటము ౧. | శుక్ల సం॥ చైత్రమాసము. 1929 సంవత్సరము ఏప్రెలు నెల. | సంచిక. ౧

సంపాదకుడు:

ఎస్. జి. ఆచార్య.

ప్రచురణకర్త.

యన్. వి. గోపాల్ మొదలియారు.

మదరాసు.

# ఆనందభారతి

## కథల మాసపత్రిక.

సంపుటము ౧. } శుక్ల సం॥ చైత్రమాసము. 1929 సంవత్సరము ఏప్రెలు నెల. { సంచిక. ౧

## స్వవిషయము—

ఆంధ్రదేశమున యిప్పటికే పెక్కుపత్రికలు బయలుదేరియున్నవి, యింకను పత్రికలేల యను వాదన మాకన్న ముందు పత్రికాప్రచురణమునకు బూనుకొనియుండినవారినే ఆంధ్రసోదరులు ప్రశ్నించియున్నసమయమున మాకుకూడ నట్టిప్రశ్నయే రాక మానదని మే మెఱుంగుదుము.

ఆంధ్రమున పత్రికలు బయలుదేరుటయు కొంతకాలమువరకు వెలువడుచుండుటయు అనంతర మంతర్ధాన మగుటయు మాసోదరసోదరీమణు లెఱుంగుదురు. ఇందులకు గల కారణము పాఠకులును పత్రికాకార్యనిర్వాహకులునుకూడ నైయున్నారని మాయభిప్రాయము.

తెలుగుదేశములో యింతవరకు బయలుదేరియుండిన పత్రికలలో చాలభాగము రాజకీయరంగముననేయుండి ఆశాఖాప్రబోధమునే యొనరించుచున్నవి. మిగిలినవి మతవేదాంతములకొరకు పాటుపడుచున్నవి.

ఈకారణమున కథలకై ప్రత్యేకింపబడియున్నపత్రిక యొక్కటేనియు కానుపించుట లేదు. ఆకొఱతనుదీర్చుటకే యీపత్రికను ప్రచురించుటకు మేముపూనుకొనుటయైనది.

కథలమూలమున యెంతటి మహత్తరాంశమునేనియు సులభముగ నెల్లరకును బోధగావింపవచ్చును. ఈయంశముల నెఱింగియే ప్రపంచమందలి అన్నిమత ప్రచారకులను తమతమకాలములయందు కథలనుకల్పించి శాశ్వతప్రచారమునకు కారణభూతులైరి.

ఈపత్రికయందు ప్రసిద్ధిజెందిన ఆంధ్రకథకులచే వ్రాయబడిన కథారాజములను ప్రచురించి ప్రతిమాసమును మాసోదరసోదరీమణుల కందజేయ తలంపడియున్నారము. మా యీప్రయత్నములకు ఆంధ్ర జనులు వలయుప్రోత్సాహము నొసంగెదరుగాక!

## సందేహము—

మల్లవరపు విశ్వేశ్వరావుగారు (విశ్వభారతి.)

గాలిడోలికలందు కకుబంతవీధి
నడయాడి నాట్యాల నవ్వాల గురిసి
పసిడివేకువపెండ్లి వసనాలతోనె
తరలెనా! మరలునా? తెలిమబ్బుతునుక.
పూవులలోవిచ్చి తావిసంపదల
నిట్టూర్చి విరహమో తిరసనో చూపి
విడబారు తొలిపొద్దు మడుగులతోనె
మరిగెనా! కరగునా? మల్లికాసుమము.
చూపుతూపుల బంచి చుక్కలదారి
తరళమై సరళమై తక్కుచు తారి
చెదరు సిద్దుర చీరచెరగుల విసరి
పోయెనా మాయమై ప్రొద్దుటి తార!
మాటిమాటికి నన్ను మరిగించి, వేచి
నాప్రేమ, నాగుండె రేపుటలేలో!
ఎదగాల్చు నీజ్యోతి ఎపుడు నాదగునో?
ఎపుడేని నాదైన ఎటు నిల్పుకొందో?

# ఇద్దరితగాయిదా—

(వనవిహారి)

“ఏమండీ, యింక నాప్రాణం విసిగింది. మీతో యిలాపోట్లాడుతూ యెంతకాలం కాపురం చెయ్యడం? అది సాధ్యమా?”

శివశంకరము పలుకకుండా కుర్చీమీద కూచొని ప్రక్కనున్న పత్రికపుటలు త్రిప్పుతూ యేమేమో చదువుకుంటున్నాడు లోలోన.

“మిమ్మల్నినేనండి, అలా పలకకుండావుంటే యేమిటనిపించుకుంటుంది? నేను యీబాధలు పడుతూవుండలేను.”

“ఐతే ఏమంటావు?”

“మీరు యిదివరకు యెన్నోమారులు అన్నారు, అంచేత నేను ఇప్పుడన్నప్పటికీ అందులో తప్పులేదు; మనం వేరేవేరేవుంటే బాగా వుంటుంది. లేకపోతే నేనుఅన్న ఒక్కమాటకున్ను మీరువొప్పుకోరు.”

“—సరే, ఔను.”

“ఐతేనేను వెళ్లిపోతాను.—”

శివశంకరం పలకలేదు.

“ఏమండీ, అలావూరుకుంటారు? మిమ్మన్నే”

“సరే, నీయిష్టంవచ్చినట్లుచెయ్యి.”

శివశంకరం తలన్నా పైకియెత్తలేదు. అతడు యింకా పత్రికనే చూస్తూవున్నాడు. ఇంతలో తలుపుతీయబడడము ఘట్టిగా వేయబడడము జరిగినది. తరవాతకొంతవరకు నిశ్శబ్దం. శివశంకరంముఖాన్ని ఆశ్చర్యంకాని కోపంకాని కనబడడములేదు. అతను అలాగే పత్రికపుటలు తిరుగవేస్తున్నాడు.

౨

శివశంకరమును కమల, కమలను శివశంకరము ప్రేమించుకొన్న తరవాతనే వివాహం జరిగింది. ఇద్దరికీ సుఖజీవనానికి కావలసినంత ధనముంది; వొకరిమీద యింకొకరికి ప్రేమవుంది. కాని తరుచు ఆ

యింటిలో వారు యిద్దరూ వొకరితో వొకరు దెబ్బలాడుకొంటూవుండే వారు. అలా దెబ్బలాడుకొన్న సమయాలలో అధికకోపంగల కమల చ(క్రమని లేచి నేనువెళ్లిపోతాను అనడం యిదివరలో యెన్నోమారులు జరిగింది. ఆకారణంచేత యీమారుకూడా అటువంటిదే జరిగిందని శివశంకరం అంత లెక్క చెయ్యలేదు.

మూడుగంటలకు వివాదపడి బయటకువెళ్లిన కమల సాయంత్రం ఆరుగంటలకు తయారయేదికాని యీదినం రెండుగంటలకు పైయంశం జరిగినప్పటికీ రాత్రి యెనిమిదిగంటలవరకూరాలేదు కమల, అంచేత శివశంకరానికి కొంచం అనుమానం.

వెళ్లి వెతుకుదామా?—అది అంత మంచిపనికాదు. చూద్దాం యెలాజరుగుతుందో అని ఆలోచిస్తూ పదిగంటలవరకూ పడకకుర్చీలో కూచున్నాడు, అతనికి నిద్దరపోదామంటే నిద్దర రావడము లేదు. అంచేత కొంతవరకు అటూయిటూ పచారీచేసి అనంతరం—యిదివరలో తాము యిద్దరూకలిసి సింగారించిన పడకగదిలోకివెళ్లి కొంచంసేపు కూచుని నాలుగు మూలలకూ దృష్టినిపోనిచ్చాడు. తరవాత వొకచిన్న నిట్టూర్పువిడిచి బయటకువచ్చి తలుపుతాళం వేసి పడకకుర్చీలో నిద్రపోయాడు.

## 3

ఉదయం యేడు గంటలవరకు టీ(త్రాగుతూవుంటే-శివశంకరం తండ్రి హితుడు, విశాలభావాలుకలవాడు, యీయిరువురి వివాహానికీ కారకుడైన మధుసూదనరావును వెంటబెట్టుకొని వచ్చింది కమల. శివశంకరం ముసిలాయనకు నమస్కరించి కూచోమన్నాడు. దూరంగావున్నకుర్చీలో కమలకూచున్నది.

"ఏమిటి, మీరిద్దరు యిలావుండడము బాగాలేదు, మీరువిడిపోతామంటారు, అంతవరకూ యిద్దరికీశాంతివుండదంటారు. యేంగాన్నా కొంచం ఆలోచించి సుంభనగా వుండరాదా?" అన్నాడు. మధుసూధనరావు.

"కమల యిష్టమువచ్చినట్టుగానేచెయ్యండి. అంతకన్నా వేరేవిధి లేదు. యిదివరకు మాలోవున్నలోపం యేమిటో తెలిసికొనడానికని యెంతోప్రయత్నించాముకాని లాభంలేకపోయింది." అన్నాడు శివ శంకరం.

ఇద్దరినీ వొకగంటసేపు అక్కడవుంచి లెక్చెరుకొట్టాడు మధసూధనరావు తరువాత ఒక్కొక్కరినీ వేరెవేరెపిలిచి చెప్పాడు. ఇద్దరు వొకేపట్టుపట్టారు.

'సరే మీకూమీకు గలసంబంధం విడిపోయింద'న్నాడు. మునిలాయన. తరువాత కమల యిల్లువిడిచిపెట్టి వెళ్లిపోయింది.

శివశంకరం యిటూఅటూ పచారుచేసి, పడకగదివద్దకువెళ్లి తలుపులు తాళంవేసి తాళపుచెవిని యెదటనున్న రోడ్డుప్రక్కనున్న పెరిటలో విసరేశాడు.

౪

మూడువారములు గడిచిపోయాయి. శివశంకరము మునుపటిలాగు విలాసంగా కాలంగడపడము లేదు. అతను యేదో అంతఅవసరమైనపని వుంటేనేగాని బయటకు కదలడము లేదు. పత్రికలు చదువుకుంటూ దినాలు వారాలు గడిపివేస్తున్నాడు.

మూడుగంటలసమయం, కమల యెండను లెక్కచెయ్యకుండా కాలినడకనువచ్చి శివశంకరం యింటిద్వారంయెదట నిలిచింది. ఆమె ముఖం అంతలో గంభీరతను, అంతలో సిగ్గును ప్రదర్శిస్తున్నది. మెట్ల మీదనిలచి యేమేమో తనలోతాను ఆలోచించిన కమల ముమ్మారు మెట్లుదిగి ముమ్మారు మళ్లీ మెట్లుయెక్కింది. ఆఖరుకు నిర్ధారణచేసుకున్నది. బిరబిర లోపలికివెళ్లింది.

శివశంకరం అప్పుడే ఉత్తరాలు వ్రాయడము ముగించి నాలుగుగంటలకు క్లబ్బులో మీటింగు అవడమువల్ల వెళ్లడానికి సిద్ధమై తనపెద్ద ఆకుచెప్పులు తొడుగుకుంటూ వున్నాడు.

కమల శివశంకరాన్నిచూచి ముఖంత్రిప్పుకుంది. తిన్నగా పడకగది తలుపుదగ్గరకువెళ్లి తాళంతీస్తూ శివశంకరం వైపుచూచింది. శివశంకర

మమాత్రం యీామెను గమనించనట్టుగానే వున్నాడు. అగౌరవం జరిగి నట్టుగా అనుకొన్నది. అంచేత ధుమధుమలాడతో "నేను నాపుస్తకాల కోసంవచ్చాను, తీసుకొంటాను" అంది.

'సరే' అని ముక్తసరిగా సమాధానం యిచ్చి శివశంకరం బయటకువెళ్లిపోయాడు.

.... ... .... ....

రాత్రి పదిగంటలసమయానికి తయారయాడు తిరుబడిగాను శివశంకరం. ఇంటికివచ్చేసరికి తనపడకగది గుమ్మంబయటవున్న బర్మా చెప్పులు కనబడ్డాయి. అవి కమలవి. లోపలచిన్నకాంతితో వెలుగుతోంది దీపం. తిన్నగా సాధ్యమైనంత తక్కువచప్పుడుతో తలుపుదగ్గరకు అతడువెళ్ళాడు. తలుపుతీసి లోపలికి వెళ్లదామనుకొని గడియమీాద చెయ్యివేశాడు. మళ్లీవొక్కనిమిషం ఆలోచించి యేమనుకున్నాడో వెళ్లి తనపడకకుర్చీపైన నిద్రపోయాడు.

శివశంకరం వర్తన మరింత ఆగ్రహానికి కారణమైంది. ఆమె 'యెంతఅగౌరం' అని మనస్సులో అనుకొంది. ఎప్పుడు తెల్లవారుతుందా యెప్పుడు వెళ్ళిపోవడమాఅని ఆతురపడుతూ ఆరాత్రిగడపింది.

తెల్లవారి కాకులు కావుకావుమని అరుస్తూవుండగానే కమల లేచి తలుపువేసి వెళ్లిపోయింది. శివశంకరానికి మెలకువవచ్చింది. కాని కుర్చీనుంచి లేవలేదు.

౬

కమల వితంతు అక్కయాత్రలు సాగించడానికని బయలుదేరింది. ఆమెతోబాటు కమలకూడా ప్రయాణంకట్టింది. దక్షిణదేశం అంతా చూడాలని అనుకొని వారుబయుద్దేరారు.

.... .... .... ....

ఈలోపుగా బొంబాయిలో పఠాన్ హిందూకార్మిక కల్లోలము బయలుదేరింది. శివశంకరం యిటువంటి విషయాలలో కలుగజేసికొన

శం మామూలు. ఆకారణంచేత తిన్నగా బొంబాయివెళ్లి సేవాసైన్యం లో చేరి గాయములు తిన్నవాళ్లకు అపారమైన సేవచేయడానికి మొదలు పెట్టాడు.

ఈసంగతిఅంతా పత్రికలద్వారా దినదినమూ కమల తెలుసుకుంటూవుంది. భర్త బొంబాయినగరానికి వెళ్లాడని విన్న ఆమె తనయాత్రను పండరిపురము మొదలైన స్థలాలకు మార్చింది. దేవాలయాలు దేవతలుచూస్తూ అక్కడ దినాలు గడుపుతూవుంటే, కమల పత్రికలలోని బొంబాయికొట్లాటలు చదువుతూవుండేది.

ఉన్నకొద్దీ కలహము మరింత తీవ్రరూపం తాల్చినట్టు వార్తల వల్ల తెలుసుకున్నది కమల. సేవాసంఘమువారికికూడా దెబ్బలు తగులుతున్నవనీ, వారిలో వొకరిద్దరు చనిపోయారనీ ఆమెచదివింది. ఆవార్త చదివిన కమలహృదయంలో తొందర కలిగింది. ఆవార్తను మళ్లీమళ్లీ చదువుతూ,యిటూఅటూ కొంతసేపు పచారుచేసింది. తరవాత బొంబాయివెళ్లడానికి నిశ్చయించుకొన్నది కమల.

## ౭

మూడురోజు లయేసరికి బొంబాయిచేరడం తటస్తించింది. కమల బొంబాయిచేరేలోపలనే అక్కడిఅల్లరులు తగ్గిపోయాయి. శాంతంగా వున్నబొంబాయి కమల కలతహృదయానికి కొంచం శాంతి కలుగజేసి నప్పటికీ శివశంకరంయెలావున్నాడో తెలుసుకుండేవరకూ ఆమెకుయేమి తోచదు. బొంబాయి ఆమెకుక్రొత్తగావుంది. ఎలాగైతేనేమి సేవాసంఘ కార్యాలయంతెలిసికొని అక్కడవున్న గౌరవోద్యోగుని కలిసికొని శివశంకరం గురించి అడిగిందికాని అతడు యెక్కడకో తొందరపని మీద వెళ్తుండబట్టి సరియైన సమాధానం యివ్వలేదు. ఇంక యెవ్వరన్నావస్తారేమో అడుగుదామనుకొని రాత్రి 9 గంటలవరకూ అక్కడే కూచున్నది. ఆఖరుకు బంట్రోతు తలుపుమూసుకు వెళ్లడానికి సిద్ధంగావుండడముచూచి ఆమె నెమ్మదిగా మెట్లుదిగి రోడ్డుమీదకు రాక తప్పిందికాదు.

రాత్రిసమయం, అందులోనూ క్రొత్తపట్టణం, స్త్రీ. ఏమితోచ లేదు కమలచదువుకొని పట్టణాలలో పెరిగినప్పటికీ స్వతంత్రంగావెళ్లి హోటళ్లలో మకాముచెయ్యడంయెరుగదు. ఒకవైపున ఆకలివేస్తున్నది. ఆఖరుకు యెలాగో వోకలాగు ఆరాత్రి ఒకహోటల్లో గడుపుదామను కొని దగ్గరగానే వోకహోటలుకనబడితే అందులోకి వెళ్లింది. అదిభోజ నాలసమయం అవడముచేత అంతా లోపల గొడవగావుంది. హాలులో మాత్రం ఒక్కడు కూచోని టిక్కెట్లుయిస్తున్నాడు. కమల హాలులోని కుర్చీలో కూచున్నది. ఆగుమాస్తా కమలను పలకరించడానికి సంకోచి స్తూవున్నాడు. కమలకూడా తలవంచుకొని కూచున్నది.

కమలదృష్టి యెంపటిగదిమీదకువెళ్లింది. అక్కడ బయట మూడు జతలచెప్పులు వున్నాయి. అవిచూచిన కమల తదేకదృష్టితో కొంతవర కూచూచింది. అందులో ఒకజతచెప్పులు పెద్దవి; చాలపెద్దవి. వాటినే తదేకదృష్టితో చూస్తూవున్నది.

ఇంతలో తలుపు తెరుచుకుంది. ఒకరిద్దరు యువకులు బయట పడ్డారు. వాళ్లనిచూచిన కమల నిరుత్సాహ అయింది. ఆయిద్దరున్నూ వెళ్లేసరికి యింకవొక్కజత చెప్పులుమాత్రం మిగలాయి. ఆమెకనులలో కొంతఉత్సాహం,కొంతభయము కనబడుతున్నది.ఇంతలో కూనిరాగం వినబడ్డది. కమల లేచినిలచింది. చిన్నచిరునవ్వునవ్వింది. మళ్లీసిగ్గుపడి భయంతో బెదరినకళ్లతో ముందుకుచూడడము మొదలుబెట్టింది.

ఇంతలో ఒకవ్యక్తి చేతికి కట్టుతోవచ్చి చెప్పులవద్ద నిలబడ్డది. కమల కళ్లనుండి నీళ్లు కారుతున్నాయి. అడుగు ముందుకు పడకుండా వుంది. ఏంచేస్తుంది! ఇంతవరకూ చూడనివ్యక్తి చెప్పులుతొడుగుకొని అమ్మ అని బాధపడుతున్నట్లుగా అంటూ కమలవైపు తిరిగి వోకమారు ముఖంచూచి ఆశ్చర్యంతో "కమలా!" అన్నాడు. మళ్లీ యెంచేతనో ఆవ్యక్తి నాలుకకరచుకుంది.

కమల ఆవ్యక్తివైపునకు రెండుఅడుగులు వేసింది. వ్యక్తికూడా ముందుకు రెండడుగులువేసి "ఏం! ఇక్కడికివచ్చావు? రా" అని చెయ్యి పట్టుకొని హాలులోకి తీసుకవెళ్లాడు.

# ప్రభాతము—

(శ్రీ. శ్రీ. శ్రీనివాసరావుగారు.)

అస్మదీయప్రఫుల్ల హృదంతరాళ
సంస్థిత పవిత్ర తరభావ సముదయ ప్ర
దర్శనోత్సుక మతినేను దమకమెసగ
దేవ! నీసన్నిధికి నేగుదెంచినాఁడ!
అత్యుదగ్ర తమిస్ర దుర్వ్యాప్తిప్ర
భిన్న మానైక శక్తిసంపన్న నిశిత
భానుకిరణ ప్రశస్త ప్రాచిదోఁచె!
సమయమయ్యెను నీపూజ సలుపుకొఱకు.
ఏయనంత ప్రభావదుర్జ్ఞేయమాన
మానితాచ్ఛ పరంజ్యోతివో, నితాంత
నిస్తుల గుణాబ్ధివో అట్టి నిన్ననంగ
గందళించిన హృదయారవింద సుమము
భక్తిపూర్వకముగ సమర్పణమొనర్తు!
మహితభవదీయరూప సంపద్విలాస
నిర్మలాంచిత మందాకినీతరంగ
సమవగాహనోపార్జిత విమలపుణ్య
మహిమకారణ గళిత కల్మషుఁడనైతి!
నిమిషకాలము నిన్ను ధ్యానింపనిమ్ము
దీర్ఘహర్ష ప్రదాయక దివ్యభావ
గీతికా నవ్యరాగ సంకీర్తనమున
నైక్యమయ్యెద ద్వన్మనోహర దిగంత
విశ్రుతశ్లోక పరిశుభ్ర వీచికలను!

# శ్రీమాన్ డాబులరాయుడు—

(నేను)

"మహాజనులారా! ఆటలాడుట కిదిసమయముకాదు. కార్యము సాధించవలయును, భారతరాజకీయములను వెనుకకు పట్టియుంచరాదు, అధినివేశస్వాతంత్ర్యమా, లేక సంపూర్ణస్వాతంత్ర్యమా? ఏది భారతదేశరాజకీయాదర్శము? ఇదివరలో సంపూర్ణస్వాతంత్ర్యతీర్మానము గావింపబడినదిగదా! దానికొక్క యంగుళమేనియు వెనుకబెట్టను" అని సభావేదిక నెక్కి ఫోటోతీయుటకు వేచియున్న కెమెరా వానికవకాశమొసంగుటకుగాను ఒకటిరెండుమారులు అభినయమును కటిపెట్టి యుపన్యసించుచుండుడు శ్రీమాన్ డాబులరాయుడుగారు రాజకీయవేత్తలు.

ఉన్నతోద్యోగమందు సుమారు యిరువదియేండ్లుమాత్రమే యుద్యోగమొనరించి అంతటి స్వల్పకాలములోననే దేశమునకై పాటుపడు తలంపుగల ఆ మహనీయుడు తల్లిదండ్రులు గడించిపెట్టిన పదిలక్షల కింకొక పదిలక్షలరూప్యములు చేర్చినయనంతరము రాజీనామా నొసంగియుండిన శ్రీమాన్ డాబులరాయుడుగారిజీవితము భారతదేశమందలి ప్రతియువతీయువకునకును ఆదర్శప్రాయమై వెలయగలదు.

శ్రీమాన్‌గారు యేతావుననున్న ఆతావునకు తగినటులు సంచరించుటలో చాల నేర్పుగలవారు. ఉన్నతోద్యోగమందున్న సమయమున ప్రభుభక్తివిశ్వాసమును వెలిబుచ్చు పద్యపంచకమును పాడిననే గాని భోజనమేనియు చేసెడివారు కారన్న ప్రతీతి నేటికినికలదు.

వలదువలదు, రాజీనామా నొసంగుట వలదని వందలకొలది బంధుపులుచెప్పినను వినకుండ శ్రీమాన్‌గారు దేశముయొక్కస్థితి కెంతయు వగచుచు జోటజోట కన్నీటిధారలగార్చుచు 'వలదు నాకీయుద్యోగమువలదు, నా దేశము నాప్రజలు యిట్లుఅధోగతిపాలగుచుండ నేనూరకొని యుండజాల'ననుచు వెంటనే యుద్యోగమును విడచి వార్త

క్యముచలన వంగియున్న నడుమునకు దట్టీబిగించి రాజకీయరంగమున కురికిరి. ఈమహనీయునిత్యాగశక్తి కింతకన్ననిదర్శ మింకేమికావలయు?

న్యాయశాఖా సభ్యత్వమునకై శ్రీమాన్ డాబులరాయుడు గారు తీవ్రముగ ప్రయత్నించిరనియు కడకాయుద్యోగమురాదని విసిగి చేయునదిలేక దేశముకై తమయుద్యోగమును బలియొసంగుచుంటి మని చెప్పుచు రాజీనామానిచ్చిరనియు కొందరు చెప్పుకొనుచుండుట తరుచు వినవగుచున్నది కాని అందెంత సత్యమున్నదో శ్రీమాన్ డాబులమహాశయులే తెలుపవలసియున్నది.

రాజకీయములయందు ప్రవేశించిన యీ మహనీయుడు దేశమం దలి అన్నిప్రాంతములయందును సంచార మొనరించెను. ఆయానగర ములయందలి పత్రికలయందు గల స్వసంఘీయుల నేకాంతముగా దిలకిం చెను. తరువాత అఖిలభారత ప్రయాణము నంతముగావించిరి. అంత టితో వారికిపేరు రా మొదలయ్యెను. యేపత్రికలోచూచినను వీరివాగ త్తలే కానవయ్యెడివి. ఒక్కవిషయము గమనించుడు, యితరరాష్ట్రీ యుల యభివృద్ధియన్న యెంతమాత్రమును అంగీకరింపని బెంగాలీల పత్రికలయందు కూడ యీయనను గురించిన వాగ్దత్తలే కాన వచ్చెను.

మూడుమాసముల కాలములో శ్రీమాన్ డాబులరాయుడు మహాశయులు ముందునకు రాగలిగిరి. అంతటితో అధ్యక్షస్థాన మా యునకు లభించినది.

ఇంకనీమహనీయుని వ్యవహారకార్యక్రమము కొంకించుక దిలకిం చవలసియున్నది. నిజముగ న్యాయవాదియైన యీయన యెల్లవేళ లను అందరికన్న ముందుగనే యుండవలయునని కోరుచుండును. ఆకా రణమున నాలుగు పెద్దతలలు గలియుచోట తన్నుండమనినను అటు లుండుట కంగీకరింపరు. అటులంగీకరింప ఆయన ఆపెద్దల సమావేశ మంతమైనదనగనే మరల కొందరిని తనదగ్గరకు బిలచి వారిని తనవా దిగా గావించుకొని పెద్దలపై వ్యతిరేకప్రచారము చేయుచుండును.

కాని తలనెరసిన యీాయనకు గౌరవము జరుపుటను యెల్ల రెరంగుదురు. అనవసరముగ నీవృద్ధునేల ఆయాసమునకు లోను గావిం పవలయునని తలంచుచుందురు.

శ్రీమాన్ డాబుల మహాశయులవారు ప్రస్తుతము కొంత శాంత ముగనున్నారు. ఆయన యేకారణముచేతనోగాని యేవిధమగు ప్రచా రముగాని గావించుచుండుటలేదు.

---

## సందేశము—

మల్లవరపు విశ్వేశ్వరావుగారు (విశ్వభారతి)

ఏపూవు పెదలోని ఏసౌరభమ్మో
తెలియని ఏముగ్ధమలయానిలమ్మో
అందని ఏదూరమంద నిక్వణమొ
నా ఉషాగగనాంగణాన దోతెంచు!
ఏ సిగ్గు విరికన్నె ఏరహస్యమ్మో
వసివాడు ఏలేతవలపు నిట్టూర్పొ
వేలయా ఏగుండె పెదరు కోరికయొ
నా ఉషాగగనాంగ ణాన తేలెడిని!
చూపులకందని చుక్కసైగలకు
చూడనేచూడని సుమసౌరభముకు
కనుపించి మాయమౌ కాంతివార్తలకు
రేగు నాహృదయమ్ము రెపరెపలాడు!
వెదకివేసరి పూవుపెద గ్రోలుతేటి,
ఎగసి వెన్నెల జేరునుగ చకోరమ్ము;
తెలియని కోరికే తెలుపెను దారి,
అన్వేషణమ్మె నా యాత్రాపథమ్ము!

## దేశదిమ్మరి—

నేను ఆంధ్రసోదర సోదరీమణులకు కనపడి సుమారు పద్దెనిమిది నెలలు అయివుంటుం దనుకుంటా. ఇంతకాలం యేమయాడా అని మీరు ఆతురతచూపి వుండకపోయినా యింతకాలం యెల్లావూరుకో గలిగానా అని నేనె ఆశ్చర్యపడుతూ వున్నాను. నా ఆప్తమిత్రులు కొంతమంది యేమయాడావీడు అని అనుకుంటూ వుండడముతటస్థించి మాత్రంవుంటుంది.

రాజకీయాలలో ప్రవేశించడమువల్ల ప్రచ్ఛన్నంగావుండి పనిచేయిస్తున్నానని కొందరుఅనుకున్నారు. సూటుబూటు హాట్‌లమీద వ్యామోహంజనించడమువల్ల ఆమోజుకాస్తా తీర్చుకుందామని తెల్లదేశాలలో కాలం వెళ్లబోస్తున్నానని మరికొంతమంది అనుకున్నారు. అలాకాదు క్రిందటి సంవత్సరంయీ డాబుజీవితముమీద విసుగుపుట్టి కృష్ణా రామా గోవిందా అనుకుంటూ కాలంగడపనానికని కొండలు అడవులూ వున్నప్రదేశాలు పట్టావని మరికొంతమంది అనుకున్నారు.

.... .... ....

నిజంచెప్పాలిసివస్తే యిందులోవి యేవీకారణాలుకావు రాజకీయాలలోదూరి పనిచెయ్యనానికి మనదగ్గర పట్టుదలా అబద్ధాలు ఆడడానికి తగినచతురతా వుంటేగా? ఇంక పోకుమరిగి పాశ్చాత్య దేశాలకు వెళ్లడమన్నది అంతకన్నా పొరపాటు. ఎప్పుడూకడుతూవుండే ముతక ఖద్దరుగుడ్డలే యిప్పుడుకూడా కడుతూవున్నాగాని అందులో యేమీ మార్పు లేదు. ఇంక ముక్కుమూసుకొని జపంచేయడమాన్నారా అది అసలేదూరం.

.... .... ....

ఇంక యిలా యింతకాలం మాయమై వుండడానికి కారణంయేమిటో చెప్పమంటారా ! ఏమీచేయకుండా వొకమూల కూచోని ముప్పొద్దులా భోజనాలుచేస్తూ పుస్తకాలు చదువుకుంటూ వుండ

దమే కారణం. అంతకన్న యెక్కువ యేమీలేదు. ఇంక మనయిష్టా గోష్టి సాగింతాం.

*     *     *

తెలుగుదేశం ఆచివరనుంచి యెత్తుకుందాము ముందు. ప్రస్తుతం గంజాంజిల్లాలో దొరలకు దొరతనాలకు సంబంధించిన వాగ్వాదాలు జరుగుతున్నాయి.

*     *     *

మనజిల్లాకు తీసుకువచ్చిన పత్రిక పైకిరావడము లేదే అని వొకరిద్దరు యువకులు అనుకుంటున్నా ప్రెస్సు వాళ్లపొట్ట పోషిస్తున్నది అంతేచాలు అని విశాఖపట్నం ప్రజలు అనుకుంటున్నారు.

....     ....     ....

వీరవరం పరివారం రాజకీయ వీధులకు యెక్కడముతోనే పెద్దాపురపు బ్రాహ్మలు కచ్చలుబిగించి కాళ్లు గుజులు యెత్తేలాగు కొంతకాలం గంతులువేసి ఆఖరుకు వూరుకున్నా ఆవూళ్లో బయద్దేరిన మునిసిపలు అల్లస్లమాత్రం ఆఖరుకాలేదు.

....     ....     ....

'ఆయనుంటే భయపడి మీటింగుల హడావడి, కాంగ్రెసు కార్యాలయం తెరించి వుంచడమున్నా' అని సాంబమూర్తిగారు జైలుకు వెళ్లడంచూచిన కాకినాడకాంగ్రెసువాదులు సుఖనిద్రలుసేవిస్తున్నారు.

....     ....     ....

ఒకసంఘం వొకసంఘపత్రికకు తగిన సహాయం చేయడము లేదు. అటువంటి సమయంలో బయలుదేరిన భేదాభిప్రాయాలవల్ల రాజమహేంద్రవరంలో తెలగసంఘముయొక్క బాగుకోసమని బయద్దేరిన రెండు పత్రికలనుచూచి ఆవూరిలోవున్న వారేగాక మొత్తము తెలగసంఘ సోదరులంతా యేమీతోచకుండా కంగారుపడుతూ వున్నారు.